నైవేద్యం లేనిదే పూజ పూర్తికాదు, భగవంతుడు ప్రసన్నుడు కాదు.

'అసలు నైవేద్యానికి' ముందు పెట్టే పటిక బెల్లం నైవేద్యమే అవసర నైవేద్యం!



# అవసర నైవేద్యం

కానీ మన కథ పేరు అనవసర నైవేద్యం!

అదెలాగంటే...

* * *

నిత్యజీవితంలో మనకి చాలామందితో అవసరాలు కలుగుతుంటాయి. కొన్ని చిన్నవి, మరికొన్ని పెద్దవి. ఇంకొన్ని చాలా ముఖ్యమైనవి.

ఈ ముఖ్యమైన అవసరాలకి ఖర్చవుతుంది.

పనిని బట్టి ఖర్చు ఉంటుంది.

ఈ విషయాల గురించి మనలో చాలా మందికి తెలుసు.

తెలియని జీవి ఒకడున్నాడు.

ఆయన పేరు బసవలింగం. మనిషి నిజాయితీకి మారుపేరు. జీవితమంతా పిల్లలకి పాఠాలు, పెద్దలకి పాటలూ వినిపించి శభాష్ అనిపించుకుని, ఆర్నెల్లక్రితం రిటైరైనాడు.

నేనంటే ఆయనకి ప్రాణం.

ఆయనన్నా నాకూ అంతే.

మా స్నేహం పాటల దగ్గర మొదలయింది. ఒక సభలో విరామసమయంలో చక్కని పద్యాలు, గీతాలూ పాడుతున్న బసవలింగం గారిని చూసి చాలా ఆకర్షితుణ్ణయ్యాను. పాటల కార్యక్రమం తర్వాత యాదృచ్ఛికంగా ఆయన నా ప్రక్కనే వచ్చి కూర్చున్నాడు. పరిచయాలు, మెచ్చికోలు అయ్యాక "మీకు... కాంచనమయ వేదికా అన్న పద్యం వచ్చునా?" అనడిగాను. అది నర్తనశాలలో బృహన్నల రణరంగంలో కురువీరుల్ని ఉత్తరుడికి పరిచయం చేస్తూ పాడిన పద్యం. బహురమ్యమైన ఆ పద్యం నాకు మహాయిష్టం.

మన చేతి గోళ్ళు కాళ్ల గోళ్ళకంటే రెండింతలు తొందరగా పెరుగుతాయి.

తనకు ఆ పద్యం రాదని చెప్పటానికి కించిత్ కించపడుతూ త్వరలోనే నేర్చుకుని నా ముందు పాడతానని నా అడ్రసు తీసుకున్నాడు. అన్నట్లుగానే అయిదో రోజున మా యిల్లు వెతుక్కుంటూ వచ్చి, అపరఘంటసాల అనిపించేట్టు యధాతథంగా పాడాడు. నేను పరవశించిపోయాను.

మా స్నేహానికి ఆ పద్యమే గుర్తుగా పెట్టుకుని, కలిసినప్పుడల్లా పద్యం పాడించుకునేవాడ్ని.

అలాంటి నా మిత్రుడు రిటైరయ్యాక దేశంలో అందరు ఉపాధ్యాయుల్లాగానే కష్టాల పరంపరలో చిక్కుకున్నాడు.

రావాల్సిన డబ్బులు లేటు, పెన్షను అంతకన్నా లేటు.

ఆరు నెలల్లోనూ ఆరు జతల చెప్పులు మార్చాడు! చెప్పులరిగాయి గానీ అధికారుల మనసులు కరిగాయికాదు.

ఈ ఆందోళన ఆయనకి మధుమేహవ్యాధిని తెచ్చి మరింత క్రుంగదీసింది.

ఆయన దుస్థితికి జాలిపడుతూనే, మరో పక్క పరిష్కారం కోసం ఆలోచించసాగాను.

ఇంతలో అనుకోకుండా ఓ పెళ్లిలో మా దూరపు బంధువొకాయన సరిగ్గా బసవలింగం గారి పెన్షను కాగితాలు ఉన్న ఆఫీసులోనే పని చేసే పెద్ద గుమాస్తాగా పరిచయం అయ్యాడు. ఆ మాటా ఈ మాటా అయ్యాక అసలు విషయం చెప్పి సహాయపడమన్నాను.

"అదెంత పని? పంపించండి... చేసేద్దాం" అన్నాడు.

నాకు చాలా సంతోషం కలిగింది. నా ద్వారా నా మిత్రుడి సమస్య పరిష్కారం అవు

తుంది కదా అని సంబరపడ్డాను. ఆ మర్నాడు బసవలింగం గారిని కలిసి విషయం చెప్పాను.

అంతా విని ఆ పెద్దమనిషి ఆనవాళ్లు, పేరు, చిరునామా కూడా తీసుకున్నాడు.

చివరికి బుర్రగోక్కుంటూ చిన్న సందేహం వెలిబుచ్చాడు.

"ఇంతకీ ఈయన నా పని ఉచితంగా చేస్తాడంటారా?"

ఆయన అమాయకత్వానికి నాకు నవ్వొచ్చింది.

"అయ్యా! ఉచిత సేవలన్నీ ద్వాపరయుగంతోనే ముగిసాయి. ఇప్పుడు కలియుగం గనుక పారితోషికం ఇస్తేనే పనవుతుంది. లేకపోతే అనుచితసేవలే లభిస్తాయి. అందుకే మీరు ఆర్నెల్లు తిరగాల్సి వచ్చింది!"

"నాకు ఇవ్వటం, పుచ్చుకోవటం రెండూ అలవాటులేవే"

"చెప్పాగా! అది లేకే మీకీ కష్టాలు. మీరు పుచ్చుకోకపోయినా ఇవ్వాల్సిన చోట ఇవ్వక తప్పదు."

"పని చేస్తాడో లేదో తెలియకుండా ఎలా ఇవ్వటం? తీరా యిస్తే చేయకపోతే?"

"అలాంటి భయాలేమీ అక్కర్లేదు! డబ్బులు తిన్నవాడు గ్యారంటీగా పనిచేస్తాడు. లేకపోతే అల్లరి పెడతారు కదా?"

"సరే... అలాగే ఇద్దాం. ఇంతకీ ఎంత ఇమ్మంటారు?"

"ముందు అవసర నైవేద్యంగా ఓ వంద ఇవ్వండి. 'అసలు నైవేద్యం' పనిపూర్తయి, కాగితాలు ఇచ్చేటప్పుడని నచ్చచెప్పండి..."

"వంద తక్కువని నసిగితే..."

# కేఆర్టీ

"బీద అరుపులతో అతి కష్టం మీద మరో యాభై యివ్వండి..."

"సరే... మీరు చెప్పినట్లే చేస్తాను. రేపే ఆయన్ని కలుసుకుంటాను... రాగానే మీకు విషయం చెబుతాను..." అన్నాడు.

* * *

అన్నట్టుగానే అయిదురోజుల తర్వాత బసవలింగంగారు ఓ సాయంత్రం పూట వచ్చాడు. ఇంకా ఇంటికి వెళ్లినట్టు లేదు. చంకన సంచీ అలాగే ఉంది.

రాగానే అలసటగా కుర్చీలో కూలబడి, మంచినీళ్లు తాగాక సేద తీరాడు. "షుగర్‌వ్యాధి కదా పాపం" అని జాలిపడ్డాను.

"వెళ్లిన పని ఏమయింది?" కుతూహలంగా అడిగాను.

"వెళ్లాను. కలుసుకున్నాను. మీ సంగతి చెప్పాను. బాగానే మాట్లాడాడు. నా పూర్తి వివరాలు ఇమ్మన్నాడు. కాగితం మీద రాసిచ్చాను. కాగితంతో బాటు మళ్లీ బీదఅరుపులు అరిచే ఓపికలేక రెండొందలు చేతిలో పెట్టాను. వద్దు వద్దంటూనే తీసుకున్నాడు. ఎప్పుడు రమ్మంటారని అడిగాను. సాయంత్రం ఓ మాటు కనిపించమన్నాడు. సరే అని మళ్లీ సాయంత్రం వెళ్లాను. ఆయన లేడు. పక్కవాడిని అడిగితే, ఆయన గత మాసమే రిటైరయ్యాడు! పెన్షను కోసం రోజూ వచ్చిపోతుంటాడు అని చెప్పాడు! అయ్యా... అదీ సంగతి. పెన్షను మాటేమో గానీ నా అవసరనైవేద్యం చివరికి అనవసర నైవేద్యం అయింది" అని ముగించాడు.

నా నోట మాట లేదు!